క్లుప్తంగా

క్రాస్‌రెగ్యులేటరు నుంచి నీటి విడుదల



బానకచెర్ల రెగ్యులేటరు గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి ఆదివారం 12,000క్యూసెక్కులను అధికారులు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి ఎస్‌ఆర్‌ఎంసీ ద్వారా 12,000 క్యూసెక్కుల నీరు బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు చేరుతుందని ఈఏ దేవేంద్ర తెలిపారు. ఈ నీటిని తెలుగుగంగ(వీబీఆర్)కు పదివేల క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ వెయ్యి, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు వెయ్యి క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.

మహానందిలో సండే సందడి



మహానంది రుద్రగుండం కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: మహానందిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. భక్తులు ముందుగా రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది, పెద్ద నంది ప్రాంతాలను సందర్శించి పూజలు చేశారు.

ఆర్థిక సాయం



ప్రమాదంలో గాయపడిన నాగరాజుతో మాట్లాడుతున్న రమణమాదిగ

పాములపాడు: ఎమ్మార్పీఎస్ కమిటీల ఏర్పాటుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ఆదివారం ఆ సంఘం నియోజకవర్గం ఇన్‌చార్జ్ రమణమాదిగ ఆర్థిక సాయం చేశారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బానకచెర్ల గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, నాయకుడు పాములపాడు శేఖర్‌ను ఆయా గ్రామాలకు ఆయన వెళ్లి పరామర్శించారు. అధైర్యపడద్దొని, అండగా ఉంటామని బాధిత కుటుంబాలకు రమణ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమరాజు, మండల ఇంచార్జి మోహన్, నాయకులు ప్రసాద్, నాగరాజు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

బస్సు-లారీ ఢీకొని డ్రైవర్, కండక్టర్‌కు గాయాలు



నందికొట్కూరు రహదారిపై ఢీకొన్న ఆర్టీసీ బస్, లారీ

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు-గార్గేయపురం మధ్య భారత్ పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం ఆర్టీసీ బస్సు-లారీ ఢీకొన్నాయి. ఎస్‌ఐ తిరుపాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలుకు వెళ్తున్న ఆత్మకూరు ఆర్టీసీ డిపో బస్సు, నందికొట్కూరు వైపు వస్తున్న లారీ ఢీకొన్నాయి. ఆర్టీసీ బస్ డ్రైవర్ ప్రసాద్‌తోపాటు, కండెక్టర్ సరస్వతికి స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్ డ్రైవర్, కండెక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ చెప్పారు.

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో ఆదివారం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

కన్నీటి ఖరీఫ్



వర్షాలకు నేలకొరిగిన మొక్కజొన్న పైరు

- వర్షాలకు వేలాది ఎకరాల్లో పంట నష్టం
- పెరిగిన పెట్టుబడులు
- దక్కని గిట్టుబాటు ధర
- భారీగా నష్టపోయిన రైతులు



ఆత్మకూరు వద్ద ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులు

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులను కన్నీరు పెట్టించింది. మే నెలలో పుష్కలంగా వర్షాలు కురవడంతో రైతులు పంటల సాగు చేశారు. వర్షాలు పుష్కలంగా కురుస్తున్నాయి, ఆర్థికంగా ఎదగవచ్చని భావించారు. అయితే అధిక వర్షాలు అన్నదాత ఆశలను అడియాసలు చేశాయి. చేతికందిన ధాన్యం తడవడంతో రైతులు కన్నీరు పెట్టుకున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ రైతులను నట్టేట ముంచి అప్పులపాలు చేసింది.

వేలాది ఎకరాల్లో పంట నష్టం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, కంది, మెట్టవరి, మిర్చి పంటలతో పాటు సోయాబీన్, మినుము పంటలను సాగు చేశారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు మండలాల్లో ఈ ఏడాది గతేడాది కంటే అత్యధికంగా మొక్కజొన్న పంటను రైతులు సాగుచేశారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 16,833 హెక్టార్లు కాగా.. అత్యధికంగా 18,700 హెక్టార్లలో పంటను వేశారు. అలాగే పత్తి సాధారణంగా 3,400 హెక్టార్లలో సాగుచేయాల్సి ఉండగా ఈ ఏడాది 1421 హెక్టార్లలో మాత్రమే పంట సాగు చేశారు. మెట్ట వరి పంట 7 వేల హెక్టార్లకు గానూ 6 వేల హెక్టార్లకు పైగా పంటలు వేశారు. కంది 536 హెక్టార్లు, మినుము 984 హెక్టార్లు, మిర్చి 924 హెక్టార్లలో సాగుచేశారు. అధిక వర్షాలకు ఈ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

రెండుసార్లు విత్తు వేసినా ఫలితం శూన్యం

సాధారణంగా రైతులు వర్షాలు కురిస్తే ఒక్కసారి విత్తు వేయడం ఆనవాయితీ. కానీ ఈ ఏడాది అధిక వర్షాలకు రైతన్నలు మొదట వేసిన విత్తనాలు మొలకెత్తి పైరు ఆశాజనకంగా పెరగకపోవడంతో పంటను చెడిపేసి మళ్లీ విత్తుకున్నారు. ఇలా నెల రోజుల వ్యవధిలోనే మొక్కజొన్న, కంది, మిర్చి, సోయాబీన్ పంటలను రైతులు చెడగొట్టి మళ్లీ వేశారు. ఇలా రెండుసార్లు విత్తు వేడటంతో అన్నదాత ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి నెలకొంది.

తడిచి మోపుడైన పెట్టుబడులు

రెండుసార్లు విత్తు వేయడంతో పాటు ఎరువులు, విత్తనాలు, చేతి ఖర్చులు, కూలీల ఖర్చులు కలుపుకుని ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల దాకా రైతులు పెట్టుబడులు పెట్టారు. చివరికి అరకొరగా పండిన మొక్కజొన్న, వేరుశనగ, వరి తదితర పంటలు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు పూర్తిగా చితికిపోయారు.

మద్దతు ధర కరువాయే....

పంటలకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. క్వింటాల్ మొక్కజొన్న రూ.3 వేల నుంచి రూ.3200 వరకు ఉండగా, ధాన్యం తడిసిందన్న సాగుతో వ్యాపారులు, దళారులు మొక్కజొన్న క్వింటా రూ.1800 నుంచి రూ.2200 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మిర్చి కిలో రూ.8 నుంచి రూ.10 పడిపోవడం, సోయాబీన్ సైతం మద్దతు ధర కంటే తక్కువగా ఉండడంతో రైతులు తీవ్ర నష్టాన్ని చవి చూశారు.

ఈ ఏడాది రెండుసార్లు విత్తు వేశా



ఈ యేడాది ఖరీఫ్ ప్రారంభంలో పుష్కలంగా వర్షాలు రావడంతో సంతోషించాం. జూన్ కంటే ముందుగానే విత్తు వేశాం. అయితే వర్షాలు అధికం కావడంతో పైరు దెబ్బతినడంతో వేసిన మొక్కజొన్న పంటను చెడిపేసి తిరిగి రెండోసారి విత్తు వేశాం. ఇలా రెండుసార్లు విత్తు వేయడంతో ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల దాకా నష్టపోయాను.

– సామేల్, ఆత్మకూరు రైతు

జూన్ తొలివారంలోనే విత్తు వేశాం



8 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాను. ఇందులో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. పంటలు బాగా పండుతాయని ఆశించా, అయితే అధిక వర్షాలకు పైరు ఏపుగా పెరగలేదు. పంట వస్తుందన్న ఉద్దేశంతో ఎరువులు వేశా. తీరా అధికంగా వర్షాలు రావడంతో పంట దెబ్బతింది. అరకొరగా పండిన పంటకు గిట్టుబాటు ధర కూడా లేదు. ధాన్యం ఆరబోయగా వర్షాల దెబ్బకు తడిచింది. పెట్టుబడులు కూడా రాకపోవడంతో దాదాపు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు నష్టపోయాను.

– రామకృష్ణారెడ్డి, క్రిష్టాపురం రైతు

కోలుకోలేని దెబ్బ తగిలింది



ఖరీఫ్‌లో కురిసిన వర్షాలకు ఆశపడి అత్యధికంగా మొక్కజొన్న పంటను సాగుచేశా. క్వింటా రూ.3 వేలు ఉండడంతో ఈ పంట వైపు దృష్టి మళ్లించాను. నాకున్న పది ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా, మొదటగా వర్షాలు అధికమవడంతో దెబ్బతింది. రెండోసారి పంటను సాగుచేశాను. చివరికి సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు పంట దెబ్బతింది. ధాన్యం పూర్తిగా వర్షంలో తడిసిపోయింది. పెట్టుబడులు కూడా ఈఏడాది రాలేదు. దాదాపు రూ.3 లక్షల నుంచి రూ.4.50 లక్షలకు పైగానే నష్టపోయాను.

– హనుమంతరెడ్డి, సిద్ధపల్లి రైతు

వేతనాల కోసం ఎదురు చూపులు

మహానంది: మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న ఏజెన్సీ ఉద్యోగులకు గత నెల వేతనాలు చెల్లించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. వేతనాలు లేకుండానే దసరా పండుగ చేసుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహానందీశ్వరస్వామి దేవస్థానంలో పారిశుధ్య, ఇతర పనుల నిర్వహణ కోసం సుమారు 70మందికి పైగా ఏజెన్సీ ద్వారా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ ఉద్యోగుల సరఫరా టెండర్లను దక్కించుకున్న సంస్థ గడువు ముగియడంతో అప్పటి వరకు సుమారు తొమ్మిది రోజుల వేతనాన్ని ఆ సంస్థ వారు ఉద్యోగుల అకౌంట్లలో వేశారు. అధికారులు స్పందించి మిగతా వేతనాలు చెల్లించాలని ఏజెన్సీ ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేలకొరిగిన వృక్షం



ప్రధాన రహదారికి అడ్డంగా నేలకొరిగిన వృక్షం

శ్రీశైలంప్రాజెక్ట్: హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారికి అడ్డంగా ఆదివారం ఉదయం భారీ వృక్షం నేలకొరిగింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఫిల్టర్‌హౌస్‌లో ఉన్న వృక్షం కూలిపోవడంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వృక్షం కూలిపోవడంతో ఫిల్టర్‌హౌస్ ప్రహరికి ఆనుకొని వేసుకున్న బంకు ఒకటి పూర్తిగా దెబ్బతిన్నది. అధికారులు రహదారికి అడ్డంగా ఉన్న చెట్టును తొలగించి వాహనాల రాకపోకలకు పునరుద్ధరించారు.

కమనీయం.. మహానందీశుడి కల్యాణం



అలంకరణలో మహానందీశ్వరస్వామి దంపతులు

మహానంది: మహానందీశ్వరుడి దంపతులకు ఆదివారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. నిత్య కల్యాణోత్సవంలో భాగంగా అలంకార మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు ఆంజనేయశర్మ, హనుమంతు శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్య ధారణ, అక్షింత సమర్పణ పూజలను వైభవంగా చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించి పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



మహానందిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ పార్వతి, కుటుంబ సభ్యులు

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానందీశ్వరుడి సన్నిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ పార్వతి, కుటుంబ సభ్యులు ఆదివారం పూజలు నిర్వహించారు. వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వేదపండితులు వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

నందికొట్కూరు: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మండల పరిధిలోని మల్యాల, శాతనకోట గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. శాతనకోట, మల్యాల గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ జనార్దన్‌గౌడు, ఎంపీటీసీ చిన్న సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీలో ఆదివారం నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరయ్యారు. సర్పంచ్ వరప్రసాద్, ప్రత్యేక అధికారిణి రత్నరూత్, డీఈ రామ్మోహన్, ఎంపీడీఓ చంద్రశేఖర్, జేఈ రాఘవేంద్రప్రసాద్, ఏపీఓ విమలమ్మ తదితర నాయకులతో కలిసి ఎమ్మెల్యే అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, అధికారులు

చినుకు పడితే చిత్తడే

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో చినుకు పడిందంటే చిత్తడిగా మారుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా ప్రధాన రహదారి పలు చోట్ల కుంటలను తలపిస్తోంది. దీంతో వాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది. ప్రధాన రహదారికిరువైపులా ఇళ్ల ముందు ఎవరికి వారు ఎత్తుగా మట్టి బిలుకు తరలించుకోవడంతో రహదారి కాలువలా మారింది. వర్షం కురిసిన సమయంలో నీరు ఎటూ ప్రవహించే దారి లేకపోవడంతో నిలిచి పోతోంది. ఈ నీరు ఇలాగే నిలిచి ఉండటం వల్ల దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి పై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వర్షపు నీటితో కుంటను తలపిస్తున్న ప్రధాన రహదారి

నిప్పులవాగుకు 790 క్యూసెక్కుల విడుదల

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 790క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల వలన 93,324క్యూసెక్కుల వరదనీరు సుంకేసుల డ్యాంలోకి వచ్చి చేరుతుందన్నారు. డ్యాంలో 1.2టీఎంసీల నీటిని నిల్వచేసుకొని మిగిలిన నీటిని నదిలోకి వదులుతున్నట్లు తెలిపారు. సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,000క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,184క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. ఈ నీటిలో 790క్యూసెక్కులు నిప్పులవాగుకు, 360క్యూసెక్కులు తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు, 34క్యూసెక్కులు ఏబీఆర్ కాల్వకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

పోతిరెడ్డిపాడు నుంచి కొనసాగుతున్న సాగునీటిసరఫరా

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఆరుగేట్ల ద్వారా దిగువ ప్రాంతాలకుసాగునీటి సరఫరా కొనసాగుతున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. వర్షాల వలన నీటిసరఫరాను రెండురోజుల క్రితం వరకు తగ్గించినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ 12వేల క్యూసెక్కులకు పెంచినట్లు తెలిపారు. ప్రస్తుతం పోతిరెడ్డిపాడు ఆరుగేట్ల ద్వారా 12వేల క్యూసెక్కుల నీటిని ఎస్సారెమ్సీ కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈనీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగు గంగ కాల్వకు 10వేల క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్, కేసీ ఎస్కేప్ కాల్వకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.



కేసీ కాల్వకు సరఫరా అవుతున్న సాగునీరు

ఉపాధి పనులు కల్పించాలి

ఆత్మకూరు: పట్టణంలోని వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం పట్టణ, మండలాధ్యక్షులు రణధీర్, రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని వెంగళ్‌రెడ్డినగర్‌లో ఆదివారం సీపీఎం మహాసభల సందర్భంగా జెండా ఎగురవేశారు. వారు మాట్లాడుతూ కేరళ, త్రిపుర, పశ్చిమబెంగాళ్‌లో వామపక్ష పార్టీల పాలనలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసేందుకు ఎంతగానో కృషి చేయడం జరిగిందన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో కూడా వ్యవసాయ కూలీలు ఉన్నారని, వీరందరికీ ఉపాధి పనులు కల్పించి జీవనోపాధి పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శివుడు, గణపతి, రాముడు, కరిముల్లా, మాలిక్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

23న మండల సర్వసభ్య సమావేశం

పగిద్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీన ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు 22వ తేదీ నాటికి కార్యాలయ ఏఓకు అందజేయాలని సూచించారు. సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాని సూచించారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వల్ల అన్యాయం

ఆత్మకూరు: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు, మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో తీవ్రమైన అన్యాయం జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడుయాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి బాలస్వామియాదవ్ అన్నారు. ఆదివారం ఆత్మకూరులోని బీసీ సంఘం కార్యాలయంలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, బీసీ నాయకులు వెంకటరమణ యాదవ్, నారాయణ యాదవ్, శ్రీహరి, పెద్దన్న, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

నందికొట్కూరు: మండల పరిధిలోని నాగటూరు గ్రామానికి చెందిన శిరీష ఈ నెల 18వ తేదీన హత్యకు గురైన విషయం తెలిసిందే. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను ఆదివారం అరెస్టు చేశారు. శిరీషను హత్య చేసిన గొల్ల కురుమన్న, వేధింపులకు పాల్పడిన భర్త గొల్ల నరసింహులు, అత్త గొల్ల మహేశ్వరిని పట్టణ సమీపంలోని ఉర్దూ మదర్సా వద్ద అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ముగ్గురిని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ చెప్పారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా ఆదివారం తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్ర విద్యార్థి సంఘం నియోజకవర్గ కన్వీనర్ మహేష్ డిమాండ్ చేశారు. ఈ విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

వధూవరులకు ఆశీర్వాదం

ఆత్మకూరు: ట్టణంలోని ఎండబ్ల్యూ ఫంక్షన్ హాలులో ఆదివారం వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు సయ్యద్‌మీర్ కుమారుడు వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్షా సోదరుడు వివాహ మహోత్సవానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్ పార్వతి ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు అహ్మద్‌హుసేన్, అంజాద్‌అలీ, నబి, సురేష్, కలిముల్లా, షేక్ బైరాపురం మహబూబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ వెలుగోడు మండల అధ్యక్షులు అంబాల ప్రభాకర్‌రెడ్డి, దేశం తిరుపంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కురుకుంద శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ముచ్చుమర్రిలో కార్డన్ సర్చ్

పగిద్యాల: నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మిడుతూరు, జూపాడుబంగ్లా ఎస్‌ఐలు ఓబులేసు, లక్ష్మీనారాయణ పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో స్పెషల్ పార్టీ బృందంతో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమస్యాత్మకం, అంత్యంత సమస్యాత్మక గ్రామాలు, రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్స్, డెకాయిట్స్ కదలికలపై నిఘా పెంచాలన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోకపోతే గ్రామ, జిల్లా బహిష్కరణ చేయిస్తామని హెచ్చరించారు. తరుచు గొడవలు సృష్టించే వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసి మండల మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చాలని పోలీసులకు సూచించారు.



పాత ముచ్చుమర్రిలో పోలీసుల కవాతు

రహదారులకు భూమిపూజ

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధే తమ ధ్యేయమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురం, క్రిష్ణాపురం, శ్రీపతిరావుపేట, వడ్ల రామాపురం గ్రామాల్లో ఆయన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా నూతన రహదారులకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో అంతర్గత రహదారులను ఏర్పాటు చేయడంతో పాటు డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుపాలమ్మ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంశెట్టి, శివప్రసాద్‌రెడ్డి, రాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

నేడు సాగునీటి సలహాసంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

జూపాడుబంగ్లా: సాగునీటి సలహా సంఘాల ఎన్నికల నిర్వహణకు సోమవారం నోటిఫికేషన్ వెలువడనున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాగునీటి సలహాసంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఏఈ తెలిపారు.

విద్యుత్ కోతలతో అల్లాడుతున్న ప్రజలు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో ప్రతిరోజూ సుమారు 8గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. రోజుకు కనీసం 10 సార్లైనా అప్రకటితంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో ఫీడర్లు స్విచ్‌యార్డ్‌లో ఉండడంతో అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడేవి. ఈ సమస్యను అధిగమించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రు.3.15కోట్లతో సున్నిపెంటలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించింది. అవసరమైన ఉద్యోగులను కూడా నియమించింది. అయినప్పటికీ విద్యుత్ కోతలకు అంతులేకుండా పోయింది. ఆదివారం ఉదయం నుంచి పలుమార్లు, సాయంత్రం 04:30 నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఊరూరా బెల్టు షాపులు!

- గ్రామాల్లో జోరుగా మద్యం విక్రయాలు
- క్వార్టర్ సీసాపై రూ. 70 అదనం
- అందులో లైసెన్స్ దారులకు రూ.20

మహానంది: మద్యం షాపులు ఏర్పాటై వారం గడవక ముందే ఊరూరా బెల్టుషాపులు మూడు క్వార్టర్లు, ఆరు ఫుల్లుబాటిళ్లలాగా వర్ధిల్లుతున్నాయి. క్వార్టర్ సీసాపై రూ. 50 నుంచి రూ. 70 తీసుకుంటూ మద్యం బాబుల కళ్లు బైర్లు కమ్మి కిక్కు లేకుండానే కిందపడేలా చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మహానంది మండలంలో గాజులపల్లె, మహానంది, తిమ్మాపురం గ్రామాల్లో మద్యం షాపులు ఉండేవి. ప్రస్తుతం గాజులపల్లెలో రెండు, బుక్కాపురంలో ఒకటి ఏర్పాటు చేశారు. పర్మిషన్ లేకుండానే పర్మిట్ రూములు సైతం ఏర్పాటు చేసి తాగించేస్తున్నారు. ఇదిలా ఉండగా బుక్కాపురంలో శ్రీ ఉమామహేశ్వర గురుపీఠం, శివాలయం సమీపంలో దుకాణం ఏర్పాటు చేశారు.

బెల్టుషాపుల నిర్వాహకులకు పండుగ

తిమ్మాపురం, మహానంది గ్రామాల్లో షాపులు లేకపోవడంతో బెల్టుషాపుల నిర్వాహకులకు పండుగలా మారింది. షాపు నుంచి రోజూ అధిక సంఖ్యలో క్వార్టర్ సీసాలు తెచ్చుకుని అధిక ధరకు విక్రయిస్తూ మందు బాబుల జేబులు గుల్ల చేస్తున్నారు. సీసాపై ఏకంగా రూ. 50 నుంచి రూ. 70 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. బెల్టుషాపులను దక్కించుకున్నవారు మద్యం షాపుల వారికి సీసాకు రూ. 20 ఇవ్వాలని సమాచారం. గ్రామాల్లోని కొందరు పచ్చ నేతలు సైతం అప్పుడే వాటాలకు తెరలేపినట్లు ఆ పార్టీ నేతలే బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బెల్టుషాపులు లేకుండా చూయాల్సిన అవసరం ఉంది. బెల్టుషాపులు ఏర్పాటు చేసి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్న విషయాన్ని ఎక్సైజ్‌శాఖ సీఐ కృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బుక్కాపురంలో గుడికి దగ్గర ఏర్పాటు చేసిన విషయంపై పరిశీలన చేస్తామన్నారు.